319) ముఖారి

ప॥ నీకేల యీగుణము నీ వేమి గట్టుకొంటివి। యీకడ లాలించితే మేమిటు నిన్ను గొలుతుము॥

చ॥ మాటలకు లోగానిబ్రహ్మమనంటా దాచి దాచి। మాటాడకుండేవుసుమ్మీ మాతో నీవు।
నీటున మనసులో నిలుపరానివాడనంటా। పాటించి మాకు బొడచూపకుంటే గతియేది॥

చ॥ శ్రుతులకు బట్టరానిచోద్యపుబ్రహ్మనంటా। మతకాన జిక్కక మానేవుసుమ్మీ।
పతివి నీ గంభీరము బయటబడీ నంటా। అతిగోప్యాన విన్నది యెట్టెఱిగేము॥

చ॥ మాయపన్నుకొనినవుమ్మడిబ్రహ్మమనంటా। యేయెడనైనా భ్రమయించేవుసుమ్మీ।
పాయపుటలమేల్మంగపతివి శ్రీవేంకటేశ। యీయెడ నీశరణంటి మిన్నిటా మమ్మేలుమీ॥